వర్షం మాటున వ్యర్థజలాలు విడుదల

జిన్నారం (పటాన్‌చెరు): పంటపొలాల్లోకి రసాయన వ్యర్థజలాలు విడుదల చేయడాన్ని ప్రశ్నించిన గ్రామస్తులపై పరిశ్రమ ప్రతినిధులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని గడ్డపోతారం రైతులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో శనివారం పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. గత రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలను అదునుగా తీసుకొని ఎంఎస్ఎన్ పరిశ్రమ యథేచ్ఛగా వ్యర్థజలాలను విడుదల చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమలో నిర్మించిన భారీ కాలువల ద్వారా వర్షంనీటితో కలిపి బహిరంగ ప్రదేశాల్లోకి వదిలేస్తున్నారని ఆ జలాలు పక్కనే ఉన్న పంటపొలాల్లోకి చేరుతున్నాయని తెలిపారు.ఇదే విషయంపై గ్రామస్తులు, రైతులు పరిశ్రమ వద్దకు వెళ్లి ప్రశ్నించగా దురుసుగా ప్రవర్తిస్తూ పరిశ్రమ వద్దకు వస్తే కేసులు పెడతామని, అధికారులంతా మా వైపే ఉన్నారని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అధికారులకు వివరించారు. గత సంవత్సరం వ్యర్థజలాలు సేవించి 20కి పైగా గేదెలు మృతి చెందాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరిగిన పరిశ్రమ తీరు మారకపోవడం సరికాదన్నారు. ఇప్పటికే నిత్యం విషవాయువులు, వ్యర్థజలాలతో సతమతమతున్నా.. పంటపొలాల్లో కూడా అదే పరిస్థితి నెలకొందని వాపోయారు. వ్యర్థలను విడుదల చేస్తున్న ఎంఎస్ఎన్ పరిశ్రమపై కఠిన చర్యలు తీసుకోవాలని పీసీబీ ఈఈ కుమార్ పాఠక్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్జున్, చిరంజీవి, నవీన్, ఉపేందర్ పాల్గొన్నారు.

ఆలయ గడప ప్రతిష్ఠాపన

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని అనంతారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మతల్లి దేవాలయ గడపను ఆదివారం ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గడప దాతలు గుమ్మడిదల మాజీ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి పండితుల వేదమంత్రాల మధ్య ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి పాల్గొని ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతలను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి,గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

వీరభద్రుడికి శ్రావణమాస పూజలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ వీరన్నగూడెం పరిధిలోని వీరభద్రస్వామి ఆలయంలో శ్రావణమాస పూజలు కొనసాగుతున్నాయి. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాదయాత్రగా ఆలయానికి చేరుకొని లక్షపత్రి, రుద్రాభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. వచ్చిన భక్తులందరికీ అన్నదాన వితరణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఈఓ శశిధర్ గుప్తా, ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి తెలిపారు.

డీవీజీ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం

అల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని మొగులమ్మ కాలనీలో నివసించే ఎండీ అస్లాం (36) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించి డీవీజీ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్. భాస్కర్, ముజీబ్, గోపాల్, శ్యాముల్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే కాలనీ ఎన్నికలు

అల్విన్‌కాలనీ: కమల ప్రసన్ననగర్ కాలనీ కమిటీ వారు కాలనీ ఎన్నికల్లో పెట్టకుండా జాప్యం చేస్తూ, అదేవిధంగా సొసైటీ కార్యాలయానికి తాళం వేసి అందుబాటులో లేకుండా చేశారు. ఈ విషయమై కాలనీవాసులు ఎమ్మెల్యే గాంధీని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. దీనికి స్పందించిన ఆయన కార్యాలయం అందుబాటులో ఉండేలా చూస్తానని అలాగే ఎన్నికలు కూడా అతి త్వరలో జరిగేలా చూస్తానని ఆయన హామీనిచ్చారు.

ఆర్థిక సాయం అందించేందుకు కృషి

కూకట్‌పల్లి: బాలాజీనగర్ మోర్ సూపర్‌మార్కెట్ ఎదురుగా ఉన్న ప్రసాద్ బైక్ మెకానిక్ షెడ్ శనివారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. అందులో బైక్‌లు, ఇంజిను, బ్యాటరీలు, సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు షెడ్‌ను ఆదివారం పరిశీలించి తహసీల్దార్, ఇతర అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో డివిజన్ జనరల్ సెక్రటరీ వెంకటేశ్ చౌదరి, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, సుభాష్ గౌడ్, అంజిరెడ్డి, సత్యనారాయణ, యువ నాయకులు శ్రీకాంత్, కృష్ణ, వెంకట్, శాంతి తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌ల ప్రదానోత్సవం

కూకట్‌పల్లి: పాపారాయుడు నగర్‌లోని సైప్రింగ్ క్లబ్ హౌస్‌లో మాస్టర్ సంజయ్ ఏర్పాటు చేసిన తైక్వాండోలో చిన్నారులకు ఆదివారం బెల్ట్‌ల ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ.. స్వీయ రక్షణకు కరాటే, తైక్వాండో వంటివి నేర్చుకోవాలని అవసరమన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాపారాయుడు అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో స్తంభాలు
ఆదమరిస్తే ప్రమాదాలు.!



చిన్న అంజయ్యనగర్‌లో రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలు

- ఐటీ కారిడార్‌లో సాగుతున్న ప్రధాన జంక్షన్ల విస్తరణ పనులు
- విద్యుత్ స్తంభాల తొలగించకుండానే రోడ్లు వేస్తున్న వైనం
- అధికారుల మధ్య సమన్వయ లోపంతో పనుల్లో జాప్యం
- రోడ్ల మధ్యే స్తంభాలు ఉండటంతో వాహనదారులకు తప్పని తిప్పలు



హెచ్‌సీయూ బస్ డిపో సిగ్నల్ సమీపంలో రోడ్డుపై ఉన్న విద్యుత్ టవర్లు



గచ్చిబౌలి: ప్రధాన జంక్షన్లు, రోడ్ల విస్తరణలో భాగంగా రోడ్డుకు అడ్డుగా ఉన్న విద్యుత్ టవర్లు, స్తంభాల తొలగింపులో అధికారుల మధ్య సమన్వయం సన్నగిల్లింది. వర్షాకాలం లోపే విస్తరణ చేసిన జంక్షన్లు అందుబాటులోకి వస్తాయని జీహెచ్ఎంసీ అధికారులు, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. నెలలు గడుస్తున్నా విద్యుత్ టవర్లు, స్తంభాలు తొలగించి వేరే చోట అమర్చే ప్రక్రియ అనుకున్న రీతిలో జరగడం లేదు. స్తంభాల మార్పులో విద్యుత్ శాఖ అధికారులు సకాలంలో చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నారు.

◆ శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ పరిధిలోని ఐటీ కారిడార్‌లో ప్రధాన జంక్షన్ల విస్తరణకు జీహెచ్ఎంసీ శ్రీకారం చుట్టింది. యుద్ధప్రాతిపదికన స్థల సేకరణ, విస్తరణ పనులు ప్రారంభించారు. వేసవికి ముందే పనులు ప్రారంభించడం, వర్షాకాలం నాటికి పూర్తవుతాయని అధికారులు ప్రకటించారు. దీంతో ట్రాఫిక్ సమస్యకు కొంత ఉపశమనం లభిస్తుందని అందరూ భావించారు. కానీ నెలలు గడుస్తున్నా జంక్షన్ల విస్తరణ పనులు సాగుతూనే ఉన్నాయి.

అడ్డుగా విద్యుత్ టవర్లు

◆ హెచ్‌సీయూ డిపో సిగ్నల్ వద్ద స్థల సేకరణ వేగంగా చేపట్టి విస్తరణ పనులు ప్రారంభించారు. నెలలు గడుస్తున్నా ఆ పనులు ఇప్పటికీ కొలిక్కి రాలేదు. రోడ్డు విస్తరణలో భాగంగా లింగంపల్లి నుంచి వచ్చే వాహనాల కోసం సిగ్నల్ వరకు సిమెంట్ రోడ్డును వేశారు. రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ టవర్లను తొలగించలేదు. దీంతో తీవ్ర ట్రాఫిక్ జామ్ అవుతోందని వాహనదారులు చెబుతున్నారు.

◆ జంక్షన్ విస్తరణ పనులు సాగుతుండటంతో ట్రాఫిక్ పోలీసులు సిగ్నల్‌ను పూర్తిగా మూసేసి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వద్ద యూటర్న్ ఏర్పాటు చేశారు. హెచ్‌సీయూ డిపోకు వెళ్లే బస్సులు హెచ్‌సీయూ వద్ద యూటర్న్ తీసుకోవడంతో ట్రాఫిక్ జామ్ నెలకొంటుంది. అంతే కాకుండా మసీద్‌బండ నుంచి వాహనదారులు లింగంపల్లికి వెళ్లేందుకు దూరంగా ఉన్న హెచ్‌సీయూ వైపు వెళ్లకుండా రాంగ్‌రూట్‌లో వెళ్తున్నారు.

ట్రిపుల్ ఐటీ జంక్షన్లనూ...

◆ ట్రిపుల్ ఐటీ జంక్షన్‌లో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో జంక్షన్ విస్తరణ చేపట్టారు. స్థల సేకరణ చేసి, రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. విద్యుత్ టవర్లు, స్తంభాలు అడ్డుగా ఉన్నా.. ఇప్పటి వరకు వాటిని పక్కకు తరలించలేదు. విద్యుత్ టవర్లు తొలగించడంలో జాప్యం కావడంతో స్తంభాలు ఉన్నా సిమెంట్ రోడ్డు వేశారు.

◆ డీఎల్ఎఫ్ నుంచి ట్రిపుల్ ఐటీ జంక్షన్‌కు వెళ్లేందుకు విస్తరణ పనులకు అడ్డుగా ఉన్న స్తంభాలను ఇప్పటికీ తొలగించకపోవడం గమనార్హం. ట్రిపుల్ ఐటీ జంక్షన్‌లో అండర్ పాస్, ఐఎస్‌బీ రోడ్డు నుంచి డీఎల్ఎఫ్ వైపు ఫ్లైఓవర్ ప్రతిపాదన ఉంది. విద్యుత్ టవర్లు, స్తంభాలను ప్లాన్ ప్రకారం త్వరగా మార్చితేనే పనులకు ఆటంకం లేకుండా ఉండే అవకాశం ఉంది.

◆ ఔటర్ రింగ్ నుంచి కొండాపూర్ వైపుకు వెళ్లేందుకు ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఫ్లై ఓవర్ ప్రారంభించిన విషయం తెలిసిందే. చిన్న అంజయ్యనగర్‌లో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకపోవడంతో ఫ్లై ఓవర్‌పై నుంచి వాహనాల రాకపోకలకు అంతరాయం కల్గుతోంది.

◆ గతంలో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డెవిస్, శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిలో అన్ని శాఖలతో సమన్వయం చేసుకోవడంతో పనులు కొలిక్కి వచ్చాయని చెబుతున్నారు. వారిద్దరు బదిలీ కావడంతో పనుల్లో జాప్యం జరుగుతోందని పేర్కొంటున్నారు.

◆ జీహెచ్ఎంసీ, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, విద్యుత్ శాఖ అధికారుల సమన్వయం లోపంతో పనులు ముందుకు సాగడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జంక్షన్లు, రోడ్ల విస్తరణ పనులను పరిశీలించామని వెస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ బొర్ఖడే తెలిపారు. అన్ని అధికారులతో మాట్లాడి సమన్వయంతో పనులను పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు.



డీఎల్ఎఫ్ రోడ్డులో రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు



ట్రిపుల్ ఐటీ జంక్షన్‌లో సిమెంట్ రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ టవర్లు

తవ్వారు సరే.. పూడ్చేదెప్పుడు.?

- రోడ్డు పనుల్లో జాప్యం
- అవస్థలు పడుతున్న కాలనీవాసులు, విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

శేరిలింగంపల్లి: అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారుతోంది. శేరిలింగంపల్లి డివిజన్‌లోని ప్రశాంత్‌నగర్ నుంచి గోపీనగర్‌కు వెళ్లే రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే నిత్యం బస్తీవాసులు అవస్థలు పడుతున్నారు. రోడ్డు వేసేందుకు జీహెచ్ఎంసీ అధికారులు ఉన్న రోడ్డును తవ్వి నెల రోజులు అవుతున్నా పనులు నిలిచిపోయాయి. దీంతో ఆ మార్గంలో ఉదయం, సాయంత్రం విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు, మహిళలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. ఆ మార్గంలో ఉన్న డ్రైనేజీ పొంగిపొర్లుతోంది. ఈ విషయాన్ని సీవరేజ్ బోర్డు అధికారుల దృష్టికి స్థానికులతో పాటు కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ కూడా తీసుకెళ్లారు. పనులు పూర్తి చేయాలని ఆదేశించినా ఫలితం లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇరు విభాగాల అధికారులు సమన్వయంతో రోడ్డు పనులు వెంటనే పూర్తి చేసి బస్తీవాసులు రాకపోకలకు అనువుగా ఈ రోడ్డును మార్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



ప్రశాంత్‌నగర్ నుంచి గోపీనగర్ వెళ్లే దారిలో తవ్వి వదిలేసిన రోడ్డు

రూ.1.59కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణం

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మంజీరా రోడ్డు నూతన రోడ్డు రూ.1.59 కోట్లతో మైహోమ్ జ్యువెల్ వెనక గేట్ నుంచి హుడా కేఫ్ వద్ద ఉన్న కేకేఎస్ బేకర్స్ వరకు చేపడుతామని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అన్నారు. ఆదివారం కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన మంజీరా రోడ్డు నూతన రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంజీరా రోడ్డు సమస్య నేటితో పరిష్కారం అవుతుందన్నారు. పాత పైప్‌లైన్ స్థానంలో నూతన పైప్‌లైన్ నిర్మించామని, సుమారు 7 కిలో మీటర్లు పైప్‌లైన్ మార్చామని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం నూతనంగా సీసీ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. మంజీర రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. సంక్షేమ, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని, ప్రజలకు ట్రాఫిక్ రహిత, మెరుగైన రవాణా సౌకర్యం కోరకు శాయశక్తుల కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, రఘునాథ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్

మియాపూర్: బీజేపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నియోజకవర్గం ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మియాపూర్ డివిజన్‌లోని నడిగడ్డతండాలో గడిచిన 11ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్తూ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా తండాలో మొక్కలు నాటారు. అనంతరం మియాపూర్ డివిజన్ నడిగడ్డతండాలో డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గడిచిన 11ఏళ్లలో తెలంగాణ రాష్ట్రానికి ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఇళ్ల నిర్మాణం, రైతులకు ఆర్థిక సహాయాలు, రహదారుల నిర్మాణం, విద్యుత్ సరఫరా పెరుగుదల, రైల్వే అభివృద్ధి, అటల్ పెన్షన్ యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా,ప్రధాన మంత్రి కిసాన్ సమాన్ నిధి, బేటీ బచావో బేటీ పడావో, సుకన్యసమృద్ధి యోజన, ఆయుష్మాన్ భారత్ వంటి మౌళిక సదుపాయాలపై ప్రజలందరూ అవగాహన చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. పర్యావరణ పరిరక్షణ కోసం పార్టీ సూచన మేరకు ప్రతీ ఒక్కరూ తమ బూత్‌ల్లో అమ్మ పేరుతో మొక్క నాటాలన్నారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఎప్పటికప్పుడూ కరపత్రాల ద్వారా ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్రరావు, బుచ్చిరెడ్డి, నాగులు గౌడ్, మణిభూషణ్, లక్ష్మణ్, పట్టాభిరామ్, గణేశ్, మనోహర్, చందు, రఘు, శివారెడ్డి, శ్రీనివాస్, సురేశ్, ప్రభాకర్, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.



నడిగడ్డతండాలో మొక్కలు నాటుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్

వైభవంగా శ్రావణమాస బోనాలు

- మొక్కులు తీర్చుకున్న మహిళలు

రాయదుర్గం: శ్రావణమాసాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లిలో వెలసిన చిత్తారమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఆదివారం తెల్లవారుజామునే ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం చిత్తారమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ మేరకు పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారికి బోనం సమర్పించి, తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్, ఎంబీసీ చైర్మన్ జెరిపేటిజైపాల్, సీనియర్ నాయకుడు అనిల్‌కుమార్‌యాదవ్ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వారందరినీ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గోపన్‌పల్లి, చేరువలోని కాలనీలు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో ఘనంగా బోనాలు...

శేరిలింగంపల్లి, చందానగర్: బోనాల ఉత్సవాలు శేరిలింగంపల్లిలో ఆదివారం వైభవంగా జరిగాయి. శ్రావణమాసం సందర్భంగా లింగంపల్లి వాసులు భక్తిశ్రద్ధలతో బోనాలను చేసి అమ్మవారికి సమర్పించారు. లింగంపల్లితో పాటు చందానగర్ గంగారం గ్రామంలోని పోచమ్మ ఆలయంలో పీఏసీ చైర్మన్ ఆరికెపూడి గాంధీ, ఎంబీసీ చైర్మన్ జెరిపేటి జైపాల్, కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, రఘునాథ్‌రెడ్డి, గౌతమ్‌గౌడ్, హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



చిత్తారమ్మకు బోనం సమర్పించేందుకు వెళ్తున్న మహిళలు



గోపన్‌పల్లిలోని చిత్తారమ్మ అమ్మవారు



లింగంపల్లిలో జరిగిన బోనాల ఉత్సవాల్లో పీఏసీ చైర్మన్ గాంధీ, ఎంబీసీ చైర్మన్ జైపాల్, కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్



గోపన్‌పల్లిలో అమ్మవారిని దర్శించుకున్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, భక్తులు

లింగాయత్‌లను బీసీలోకి మార్చింది కాంగ్రెస్సే..

కాంగ్రెస్ నేత నీలం మధు

పటాన్‌చెరు టౌన్: లింగాయత్‌లను బీసీలోకి మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు వీరశైవ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో విశ్వశాంతి కోసం పటాన్‌చెరు ఉమామహేశ్వర దేవాలయం నుంచి బొంతపల్లి వీరభద్రస్వామి దేవాలయానికి నిర్వహిస్తున్న పాదయాత్రకు హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వశాంతికి వీరశైవ లింగాయత్‌లు గత 18 సంవత్సరాలుగా పాదయాత్రను చేపట్టడం అభినందనీయమన్నారు. సమాజంలో కుల, వర్ణ, లింగ వివక్షతను వ్యతిరేకించి సమ సమాజం కోసం పోరాడిన అభ్యుదయ వాది మహాత్మా బసవేశ్వరని అన్నారు. ఆయన అడుగుజాడలలో నడుస్తూ వీరశైవ లింగాయత్‌లు సమసమాజ స్థాపనకు కృషి చేస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో లింగాయత్‌ల అభ్యున్నతికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లింగాయత్ సమాజ్ నాయకులు, పటాన్‌చెరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నరసింహారెడ్డి రెడ్డి, నాయకులు జలిగారి ఎట్టయ్య, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రోటోకాల్ చైర్మన్ పట్లోళ్ల ఆదిత్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదాపూర్ హాస్పిటల్స్ ప్రారంభం



మాదాపూర్‌లోని సాయినగర్‌లో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన 'మాదాపూర్ హాస్పిటల్స్'ను శేరిలింగంపల్లి కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జగదీశ్వర్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మాదాపూర్ ప్రాంతంలో కొత్తగా అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేసిన ఈ ఆస్పత్రి సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఆస్పత్రి నిర్వాహకురాలు డాక్టర్ పుష్పలత మాట్లాడుతూ మాదాపూర్ ఆస్పత్రిలో క్రిటికల్ కేర్, డయబెటాలజీ ల్యాబ్ అండ్ ఫార్మసీ సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. అలాగే గుండె సంబంధిత వ్యాధులు, పెరాలసిస్, డయాబెటిక్, రక్తపోటు, ఆస్తమా, థైరాయిడ్, లంగ్ డిసీజ్, మోకాలి నొప్పులు, న్యూరో తదితర సమస్యలకు కూడా చికిత్సలు అందించనున్నట్టు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు. – మాదాపూర్



మాదాపూర్‌లోని సాయినగర్‌లో మాదాపూర్ హాస్పిటల్స్ ప్రారంభోత్సవం పాల్గొన్న శేరిలింగంపల్లి కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ వి.జగదీశ్వర్‌గౌడ్, నిర్వాహకులు